క్లుప్తంగా

సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు

ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: సంక్రాంతి సెలవు దినాల్లో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ వెంకటయ్య హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు మండలం, పట్టణంలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు రోజుల్లో ప్రత్యేక క్లాసులు తీసుకుంటే ఆ పాఠశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. 18వ తేదీ గురువారం పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ధారూరు: మండల పరిధిలోని తరిగోపుల గ్రామ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు జనవరి 26న బహుమతులు అందజేయనున్నట్లు స్వామి వివేకానంద జిల్లా కన్వీనర్ హరీష్‌రావు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



చిన్నారులతో అధ్యాపక బృందం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ సహచర విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఉపాధ్యాయ వృత్తిలోని గౌరవాన్ని అస్వాదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిబేట్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపల్

అనంతగిరి: ఇటీవల హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ టీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌లో జరిగిన డిబేట్ పోటీల్లో వికారాబాద్‌లోని అనంతగిరిపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి వివేకవర్ధన్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 రీజియన్లు రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో ఎంపికయిన వారు 1800 మంది. అందులో డిబేట్ కాంపిటీషన్‌కు 117 మంది పాల్గొనగా అందులో వివేకవర్ధన్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ జేజే ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

తాండూరు రూరల్: వడ్డేరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం జినుగుర్తి గేటు వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 217 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. వడ్డేర జాతి అభ్యున్నతికి ఓబన్న కృషి మరువలేనిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరుశురాం, పండరి, రాములు, బండెప్ప పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

అనంతగిరి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని యజ్ఞ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఉజ్వల్‌రాజు అన్నారు. ఈ మేరకు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం యజ్ఞ సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో హెల్త్‌వాక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఆరోగ్యం, సంపద గురించి అవగాహన ర్యాలీతో పాటు కరపత్రాలు పంచారు.

బడుల్లో సంక్రాంతి సంబురం



పీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీకి హాజరైన సర్పంచ్ రాధిక



కుల్కచర్లలోని కేజీబీవీలో..

కుల్కచర్ల: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని అయా గ్రామాల్లోని పాఠశాలల్లో ముగ్గులపోటీలు నిర్వహించారు. మూడురోజుల పాటుగా సెలవులు ఉండటంతో అన్ని బడుల్లోని విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని ముందుగానే ఆస్వాదించారు.

అలరించిన ముగ్గుల పోటీలు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని రేయిన్‌బో, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. బాలికలు ముగ్గులు , బాలురు గాలిపటాలు ఎగురవేశారు. దుద్యాల మండల కేంద్రంలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు అలరించాయి. పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ రాఘవేందర్‌యాదవ్ నేతృత్వంలో మండలస్థాయి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను తహసీల్దార్ దానయ్య, క్లస్టర్ హెచ్‌ఎం నెహ్రూచవాన్, కరస్పాండెంట్ రాఘవేందర్‌యాదవ్ అందజేశారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

బంట్వారం: సంక్రాంతిని పురస్కరించుకుని కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా రంగవల్లులను వేశారు. పోటీలకు హాజరైన ఎంఈఓ చంద్రప్ప ఉపాధ్యాయులతో సమావేశమై పదో తరగతి పరీక్షల సన్నద్ధంపై చర్చించారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎట్టి పరిస్థితిలో వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ యాదగిరి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు



తాండూరు: సంబురాల్లో విద్యార్థులు



బొంరాస్‌పేట: దుద్యాలలో..



కోట్‌పల్లి: ముగ్గులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప, ఉపాధ్యాయులు

వైభవంగా శ్రీవారికి పూలంగిసేవ



పూలంగిసేవ అలంకరణలో వేంకటేశ్వర స్వామి

కొడంగల్ రూరల్ : పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూలతో పూలంగి సేవతో స్వామివారికి అలంకరణ చేశారు. దూపం, దీపం, నైవేద్యాలను సమర్పించారు. పాల్గొన్న భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి మంగళహారతులు అందిస్తూ దర్శించుకున్నారు.14, 15, 16వ తేదీల్లో స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తెలిపారు. 14వ తేదీన ధనుర్మాసం చివరి రోజు, భోగి పండగ సందర్భంగా గోదాదేవి అమ్మవారి కల్యాణోత్సవరం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 15వ తేదీన సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి దేవాలయంలో ఆస్థానం నిర్వహించనున్నట్లు తెలిపారు. 16వ తేదీన కనుమ పండగను పురస్కరించుకొని శ్రీగోదాదేవి అమ్మవారికి విశేషంగా సీరాటోత్సవం, అనంతరం నోము కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యాలాల: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు పడరాని పాట్లు పడుతున్నారని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ ఆరోపించారు. మండల పరిధిలోని కోకట్‌గ్రామానికి చెందిన రాములు అనే రైతుకు సర్వే నంబర్ 24, 25లో 30 గుంటల భూమి ఉంది, ఆ భూమి అధికారుల నిర్లక్ష్యం వల్ల ధరణి వెబ్‌సైట్‌లో 3 గుంటలు మాత్రమే చూపిస్తుందన్నారు. ఈ విషయమై గత రెండు సంవత్సరాలుగా కాలాయాపన చేస్తున్నారనే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. భూమికి సంబంధించిన అన్ని పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రైతుకు న్యాయం జరగకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై గురువారం తహసీల్దార్ మునీరొద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం కార్యవర్గ సభ్యులు గణేష్‌నాయక్, అంబర్‌సింగ్ ఉన్నారు.

ఘనంగా ఊరడమ్మ తల్లికి బోనాలు

తట్టెపల్లి, నాగులపల్లిలో గ్రామ దేవతకు బోనాలు
- భవిష్యవాణి వినిపించిన ఏర్పులమ్మ
- భారీగా తరలివచ్చిన భక్తులు

పెద్దేముల్ : గ్రామాన్ని చల్లంగా చూడాలని.. ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని.. వర్షాలు సమృద్ధిగా కురువాలని.. పాడి పంటలు బాగా పండాలంటూ గురువారం పెద్దేముల్ మండల నాగులపల్లి, తట్టెపల్లి గ్రామాల్లో గ్రామ ప్రజలు ఊరడమ్మ (గ్రామ దేవత)జాతరను ఘనంగా నిర్వహించారు. గడపగడపకూ బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కుల మతం బేదం లేకుండా పండుగల్లో పాల్గొన్నారు. పోతురాజు విన్యాసాలు, ఏర్పులమ్మ భవిష్యవాణి జాతరల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడు రోజుల ముందే గ్రామ శివారుల్లో ఉన్న దేవతలకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు చేశారు. ప్రతి మూడేళ్లకు ఓ సారి అమ్మవారికి జాతర తీయనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



నాగులపల్లిలో బోనాలో ఎత్తుకొని ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ?



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- పార్టీకి పదవికి రాజీనామా చేస్తా: వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్

నవాబుపేట: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గురువారం ఎంపీపీ భవాని అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, పలువురు ఆయాశాఖల మండల అధికారులు హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులు ఎవరూ నోరు విప్పలేదు. దీంతో అధికారులు కేవలం ఎజెండాలోని అంశాలను సమావేశంలో చదివి వినిపించి చేతులు దులుపుకొన్నారు. సమస్యలపై ఎప్పుడూ వాడీవేడిగా జరిగే సమావేశం సాదాసీదాగా జరగడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని పలువురు విమర్శించారు. సమావేశం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. పార్టీలను అతీతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మేలు చేసే పనులు చేస్తే సహకరిస్తామని తెలిపారు. ప్రతిపక్షం .. అధికార పక్షం తేడా లేకుండా అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. అధికారులు ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం 55 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే, వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్ మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యే కాలె యాదయ్య నమ్మడం లేదని.. ఆయన గెలుపునకు కృషి చేసినా తనపై అనుమానాలు, ఆరోపణ చేస్తున్నారన్నారు. నమ్మకం లేని చోట తాను పని చేయలేనన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి.. వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తానని సభలో అనడంతో, స్పందించిన ఎంపీటీసీ విజయ్‌కుమార్ బందయ్యగౌడ్‌ను అక్కడి నుంచి తీసుకుపోయి.. ఎమ్మెల్యేతో మాట్లాడించి ఇద్దరి మధ్యలో రాజీ కుదిర్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ జైరాం, డీఈ మాధవరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగన్‌పల్లికి బీటీ రోడ్డు వేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న బల్లరాణి

దోమ: మా గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు వర్షం పడితే చిత్తడిగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, లింగన్‌పల్లి సర్పంచ్ బల్లరాణి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేకు ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక నానా అవస్థలు పడుతున్నామన్నారు. వర్షం కురిస్తే నడిచిపోలేని దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బీటీ రోడ్డు వేయిస్తామని చెప్పి నిర్లక్ష్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ గ్రామానికి బీటీ రోడ్డును వేయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలంతా ఐక్యంగా ఉండాలి

ఆ సంఘం అధ్యక్షుడు చెన్నయ్యచారి

పరిగి: విశ్వకర్మలంతా ఐక్యతగా హక్కులు సాధించుకోవాలని విశ్వకర్మ సంఘం పట్టణ అధ్యక్షుడు చెన్నయ్యచారి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నయ్యతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంఘం ఎల్లప్పుడు విశ్వకర్మల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. విశ్వకర్మలందరికీ ఏకం చేసేందుకు తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ఐక్యంగా ఉండి సమస్యల సాధనకు పోరాటం చేస్తేనే మనకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రవిచారి, నాయకులు రమేష్, రామలింగంచారి, వినోద్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్‌లో గురువారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ డివి.నరేష్‌రాజ్ అన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన. ఉపన్యాస, ముగ్గులు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. ముగ్గుల పోటీల్లో జూనియర్స్‌లో 5వ తరగతి అద్వైత గ్రూపు, సీనియర్స్‌లో 8వ తరగతి సరిత గ్రూపు, గాలిపటం పోటీల్లో జూనియర్స్‌లో లు క్యాస్, సీనియర్స్‌లో హేమంత్‌లు బహు మ తులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ డి.వెంకటయ్య, వైస్ ప్రిన్స్‌పాల్ సంతోష, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జుంటుపల్లిలో ముగ్గుల పోటీలు

యాలాల: సంక్రాంతి సందర్భంగా జుంటుపల్లిలో రేపు(శనివారం) ముగ్గులపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాలాల మాజీ ఎంపీపీ సుమిత్రాదేవి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని పెద్దకోట సమీపంలో ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన మహిళలకు మొదటి(రూ.3 వేలు) ద్వితీయ(రూ.2వేలు), తృతీయ(రూ.1200) స్థానాల్లో నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి టెన్నిస్ పోటీలు

బొంరాస్‌పేట: సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా 13 తేదీ నుంచి మండల పరిధిలోని బొట్లోనితండాలో మండల టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.22,222, ద్వితీయ బహుమతి రూ.11,111 నగదు ఇవ్వనున్నట్లు చెప్పారు. నేడు (శుక్రవారం) సాయంత్రం 4 గంటలకు డ్రా ఉంటుందన్నారు. ఆసక్తి గల యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

బషీరాబాద్: తాండూరు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు కోడలు మల్కుడ్ నవ్య ఉదారత చాటుకున్నారు. గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయికీర్తి (9.3), వాఫియ ఉజ్మ(9.2), హారిక(8.7)కు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3,500, మూడో బహుమతిగా రూ.1,500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హీర్యనాయక్, ఎంపీటీసీ రేఖ ఠాకూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి



దోమ : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



యాలాల: జుంటుపల్లిలో

కుల్కచర్ల: విద్యావ్యవస్థ ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజుల ఆధ్వర్యంలో పీఆర్టీయు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉపాధ్యాయ్పుఎదు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్, మండల శాఖ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, పీఆర్టీయూ నాయకులు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

యాలాల: మండలంలోని జుంటుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పీఆర్టీయూ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. క్యాలెండర్‌ను ఆ సంఘ మండల అసోసియేట్ అధ్యక్షుడు వై. పరమేశ్ ఆవిష్కరించి తోటి ఉపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ సంఘం ముందుంటుందన్నారు. పాఠశాలలో బోధన సిబ్బంది, మౌలిక వసతుల కల్పనలో సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సతీష్, పీఆర్టీయూ సంఘ సభ్యులు గోవింద్, రాజు, వెంకటేష్ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

తాండూరు రూరల్: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పీఆర్టీయూ తాండూరు మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య, పురుషోత్తంరెడ్డిలు అన్నారు. గురువారం గౌతపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు సీఎం కలిసి మాట్లాడారని గుర్తు చేశారు. సమస్యలపై పోరాటం చేసే ఒకేఒక్క సంఘం పీఆర్టీయూ అని అన్నారు.



కుల్కచర్ల: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



తాండూరు రూరల్‌లో..